క్లుప్తంగా

అలరించిన నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లి షిర్డీసాయిబాబా భక్త సమాజం ఆధ్వర్యంలో ధనుర్మాసం పురస్కరించుకుని శుక్రవారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి పూజలు నిర్వహించి, హారతి ఇచ్చి, అగరువత్తులు వెలిగించి బియ్యం, నగదు వేసి స్వామివారిని కొలిచారు.

వీరాంజనేయస్వామి ఆలయానికి శంకుస్థాపన

కలిదిండి: వీరాంజనేయ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. మండలంలోని ఎస్ఆర్పీ అగ్రహారంలో శుక్రవారం వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే డీఎన్నార్ శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్టుకమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాము రవికుమార్, కట్టా లక్ష్మణరావు, చిట్టూరి బుజ్జి, మారుబోయిన విష్ణు, మసిముక్కల వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు, వాసు, మహంకాళి రావు, పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సమారాధనకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సతీమణి వీరకుమారి, కుమారుడు శ్యామ్‌ఫణికుమార్ స్వామివారి పుట్టలో పాలుపోసి పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభించారు. ఈ సమారాధనకు కనీసం 60వేల మంది భక్తులు హాజరై ఉంటారని ఉత్సవ కమిటీ సభ్యులు అంచనా వేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సహాయ కమిషనర్ నేల సంధ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆస్తి పన్ను వెంటనే చెల్లించండి

గుడివాడటౌన్: పురపాలక సంఘ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రెండవ విడత ఆస్తి పన్ను ఈనెల 31వ తేదీ లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, కుళాయి పన్ను పూర్తి బకాయిలు చెల్లించాలని అలా చెల్లించని పక్షంలో జనవరి 1 తదుపరి బకాయి మొత్తంపై నెలకు నూటికి రెండు రూపాయల చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి వెంటనే బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు.

డివిజన్ కో–ఆపరేటివ్ అధికారిగా ఫణికుమార్



గుడివాడటౌన్: గుడివాడ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారిగా వీవీ ఫణికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పాటిమీద గల డివిజన్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం డివిజన్ కో–ఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్న జి.విజయలక్ష్మి అవినీతి ఆరోపణలపై సస్పెండ్ కావడంతో జిల్లా కో–ఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వీవీ ఫణికుమార్ డివిజన్ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా పాండురంగదాసు వర్ధంతి



తోట్లవల్లూరు: ప్రముఖ హరికథా విద్వాంసుడు, బ్రహ్మశ్రీ పాడుగు పాండురంగదాసు 48వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక మార్కెట్ సెంటర్‌లో పాండురంగదాసు చిత్రపటానికి హరికథా కళాకారులు, కుటుంబసభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. హరికథా కథకురాలు పురాణం విజయలక్ష్మి భాగవతారిణి(రాజమండ్రి) చేసిన భక్త మార్కండేయ కథా గానం రమ్యంగా సాగింది. హరికథా కళాకారులు టి.రాధాకృష్ణమూర్తి భాగవతార్, టి.శ్రీనివాస్, పి.చైతన్యకృష్ణ, పాడుగు ప్రభాకర్, పాండురంగదాసు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ కూతతో గ్రామాల్లో సందడి



చింతపాడులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు



కలిదిండి మండలంలో కబడ్డీ ఆడుతున్న యువత

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. కానుకొల్లు, భైరవపట్నంలో వాలీబాల్, చింతపాడులో కబడ్డీ, లోకుమూడిలో క్రికెట్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ టీకే వెంకటరమణ, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ ఎ.ఆనందబాబు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పెనమకూరు జెడ్పీ పాఠశాలల క్రీడా మైదానాలలో పోటీలు చురుగ్గా జరుగుతున్నాయి. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఆయా పోటీలలో పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, వ్యాయామ ఉపాధ్యాయులు మణి, లక్ష్మణ్, బాలు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కలిదిండి: క్రీడల ద్వారా మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. మండల వ్యాప్తంగా శుక్రవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా 20 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 40 మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర ఇన్‌చార్జ్ డి. విజయరాజు మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఈపీఆర్డీవో రాజారావు, పీఈటీలు మావుళ్లేశ్వరరావు, రత్నంరాజు, కృష్ణకుమారి, లూయిస్, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

పసుమర్రు(పామర్రు): గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారులలో స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం మండలంలోని పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. జుఝువరం, పసుమర్రు సచివాలయాల పరిధిలో నమోదు చేసుకున్న యువకులకు కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలను నిర్వహించారు. యువతులకు కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అప్పికట్ల జవహర్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ఆనంద్‌రెడ్డి, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రపు వీరయ్య చౌదరి, గ్రామ కార్యదర్శి పద్మశ్రీ వేణి, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సానుకూలంగా ఉంది.. సహకరించండి



కార్మికులతో చర్చలు జరుపుతున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడటౌన్: కార్మికుల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కార్మికులు గమనించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కోరారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మిక నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందని ఆర్థిక పరిస్థితులు కూడా కార్మికులు గమనించాలని కోరారు. చర్చల్లో మంచి ఫలితాలు పొందుతారని ఉన్నతాధికారుల నుంచి సంకేతాలు వస్తున్నందున సమ్మె విరమణకు చర్చలు జరిపి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, కార్మిక సంఘం నాయకుడు ధనాల సత్యన్నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు డ్వాక్రా సంఘాలు



మెప్మా బజార్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గుడివాడటౌన్: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి పొదుపు విధానం ద్వారా వారిని ఆర్థికంగా స్థిరపర్చడానికి ప్రభుత్వం అనేక విధాలుగా సహకరిస్తుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం మెప్మా బజార్ అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. దీనిని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మొత్తం 25 సంఘాల వారు 25 షాపులు ఏర్పాటు చేసి తినుబండారాలు, పచ్చళ్లు, జ్యూట్ బ్యాగ్స్, చేతి తయారీ పనిముట్లు, ఫ్యాన్సీ డ్రస్‌లు, వస్త్రాలు తదితర సామగ్రి అమ్మకానికి ఉంచారన్నారు. మార్కెట్ ధర కన్నా తక్కువగా అమ్ముతూ ప్రజల నుంచి విశేష స్పందన పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు సైతం వీరిని ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, సీఎంఎం జీఎస్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అరవింద హైస్కూల్ వార్షికోత్సవం



వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథులు

అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలో శ్రీ అరవింద విజ్ఞాన విహార హైస్కూల్ 31వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడకు చెందిన శ్రీ విజ్ఞాన విహార ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఎం.గోవిందరావు, విద్యా భారతి సంఘటనా కార్యదర్శి కె.భాస్కర్, శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు పీఎస్ బ్రహ్మానందం, ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.నవీన్‌కుమార్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. తొలుత శారీరక ప్రదర్శనలు, వాద్య సహిత కవాతు ప్రదర్శన, పలు రకాల పిరమిడ్ ఆకృతులలో ప్రదర్శనలు, అగ్ని వలయంలో నుంచి దూకటం తదితర విశేష ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు ట్రిప్పు రద్దుపై విద్యార్థుల ఆందోళన



ఆర్టీసీ బస్సును నిలిపి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు–ఉయ్యూరు మధ్య ఆర్టీసీ బస్సు ట్రిప్పు రద్దుపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరు వెళ్లే ఉదయం 9 గంటల ట్రిప్పును ఇటీవల ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. ప్రతి రోజూ ఉయ్యూరులోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు విద్యార్థులు ఈ బస్సులోనే ప్రయాణిస్తారు. ఈ ట్రిప్పు రద్దు చేయటంతో గత కొద్ది రోజులుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక దళితవాడ వద్ద శుక్రవారం రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఉయ్యూరు నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సును నిలుపుదల చేసి సుమారు అరగంట పాటు ఆందోళన చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. వచ్చే సోమవారం నుంచి ఉదయం 9 గంటల ట్రిప్పును పునరుద్ధరిస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇవ్వటంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ప్రాకార మండపం పనులు వేగవంతం చేయాలి

కలిదిండి: పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థానంలో చేపట్టిన ప్రాకార మండపం పనులు వేగవంతం చేయాలని జిల్లా దేవదాయ శాఖాధికారి చెన్ను రంగారావు తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో కలిసి శుక్రవారం భోగేశ్వర స్వామి ఆలయంలో మండపం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, కొండగి ఎంపీటీసీ అధ్యక్షుడు ఇమ్మానేని లక్ష్మణరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, మసిముక్కల వెంకటేశ్వరరావు, చిట్టూరి బుజ్జి, పడవల శ్రీను పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై రద్దీ సాధారణం



క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఆలయ ఏఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి ఓ మోస్తరుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం కాస్త పెరిగింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్.రమేష్‌బాబులు క్యూలైన్లను పర్యవేక్షించారు.

నేడు కానుకల లెక్కింపు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను శనివారం లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో లెక్కింపు జరగనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ‘జగనన్న ఎందుకు కావాలి’



గుడివాడటౌన్: ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని 24వ వార్డులో జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి పేదవాడు ప్రభుత్వం నుంచి లబ్ధి పొంది ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత నాలుగున్నర సంవత్సరాల పాలనలో 24వ వార్డుకు చెందిన 2,017 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.5 కోట్ల 97 లక్షల 6 వేల 468, పరోక్షంగా 875 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 85 లక్షల 79 వేల 743, మొత్తం రూ.8 కోట్ల 82 లక్షల 86 వేల 211 లబ్ధి చేకూర్చారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌లు వీరిశెట్టి నరసింహారావు, ఎం.శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.

సమైఖ్యల ద్వారా ఆర్థిక పురోగతి



గుడివాడటౌన్: డ్వాక్రా మహిళలకు సమైఖ్యల ద్వారా ఆర్థిక ఎదుగుదల జరుగుతుందని టౌన్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీకుమారి అన్నారు. శివశ్రీ మహిళా సమైఖ్య సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 28 డ్వాక్రా గ్రూపులు ఈ సమైఖ్యను ఏర్పాటు చేసుకుని తద్వారా పొదుపు సంఘాలు బలోపేతం చేస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ వెంపల అప్పారావు, ఆర్‌పీలు ఎస్.కుమారి, వి.లక్ష్మి, డి.ఉష, సీహెచ్ భాగ్యలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళల హక్కులపై అవగాహన సదస్సు

కైకలూరు: విద్యార్థినులు, మహిళల కోసం కేటాయించిన హక్కులపై అవగాహన కోసం ఆదివారం నిర్వహించే మహిళల హక్కుల అవగాహన సదస్సు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ డి.సలోమి కోరారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్న ఈ సదస్సుకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

క్యాన్సర్ సోకిన 13 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీరంలోని మృదు కణజాలాల్లో సోకే రాబ్డోమియా సార్కోమా (ఆర్‌ఎంఎస్)తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి విజయవంతంగా చికిత్స చేసినట్లు కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు. విజయవాడకు చెందిన 13 ఏళ్ల బాలునికి మార్చి 2022 నుంచి ఎడమ కంటి లోపలి భాగంలో కంటి కాంతస్ (కనురెప్పల చివరిభాగం) వద్ద వచ్చిన కణితి క్యాన్సర్ గడ్డగా నిర్ధారించడంతో చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. నిపుణుల సంరక్షణలో కీమో థెరపీ, రేడియోథెరపీతో కూడిన సమగ్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. రోగి వయస్సు 13 ఏళ్లే కావడంతో అత్యంత నైపుణ్యంతో చికిత్స చేసి మెరుగైన ఫలితం సాధించినట్లు చెప్పారు. ఆర్‌ఎంఎస్ అనేది క్యాన్సర్ అరుదైన రూపం అని, ఇది మృదుకణజాలాల్లో, ముఖ్యంగా పక్కటెముకల కండరాల్లో, కొన్నిసార్లు మూత్రాశయం, గర్భాశయం వంటి బోలు అవయవాల్లో కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తాం

పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్

పామర్రు: అంగన్‌వాడీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి తగు విధంగా పరిష్కారానికి కృషి చేస్తానని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచడంతో పాటు, మంచి పనితీరు కనబర్చిన వర్కర్లు, హెల్పర్లకు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నట్టు చెప్పారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్



మొవ్వ మండలం కోసూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

మొవ్వ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఏఈఆర్వో, తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ శుక్రవారం ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం పలు సూచనలు అందజేశారు. మొవ్వ మండల పరిధిలోని 21 గ్రామాల్లో గల 54 పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు, విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, వృద్ధులకు, వికలాంగులకు రాకపోకలకు ర్యాంపు సౌకర్యం, భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని బీఎల్‌వోలకు సూచించారు. మొవ్వ, మొవ్వ పాలెం, వేములమడ, కోసూరు, కాజ, పద్దారాయుడుతోట ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను వీఆర్‌వోలు, బీఎల్‌వోలతో కలిసి పరిశీలించారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్



స్థానికులకు పొజిషన్ సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తోందని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక కార్పెంటర్ కాలనీలోని వారికి శుక్రవారం పొజిషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీకి చెందిన వీరంతా గతంలో బీఫారం పట్టాలతో సప్‌లై కాలువ గట్టున స్థిర నివాసం ఉంటున్నారని, కొంత కాలం క్రితం వీరికి ఇచ్చిన బీఫారం పట్టాలు పోయాయని చెప్పారు. దీంతో వారికి ప్రభుత్వం నివాస గృహాలకు సంబంధించి ఏ విధమైన పథకాలు వర్తించక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ కార్యాలయం వారితో మాట్లాడి అక్కడి స్థిర నివాసం ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పొజిషన్ సర్టిఫికెట్లను రెవెన్యూ వారు రూపొందించారన్నారు. మొత్తం 19 కుటుంబాల వారికి ఈ పొజిషన్ సర్టిఫికెట్లను అందించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఉప సర్పంచ్ డి.బాల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కూసం పెద వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్రెడ్డి అంజిరెడ్డి, నవుడు సింహాచలం, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, గ్రామ కార్యదర్శి సలీం పాల్గొన్నారు.

జగనన్న వెంటే మేముంటాం

సమ్మె వార్తలను ఖండించిన వలంటీర్లు



వార్డు ఇన్‌చార్జ్‌లతో వలంటీర్లు

గుడివాడటౌన్: నిరుద్యోగులుగా ఉన్న తమకు కొంత మేరకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచించి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, సమాజ సేవగా గుర్తించి తాము కూడా పనిచేస్తున్నామని పెద్దవీధి 8వ వార్డు, 5వ వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లు అన్నారు. శుక్రవారం వార్డు ఇన్‌చార్జ్, సచివాలయ ఇన్‌చార్జ్‌లతో వలంటీర్‌లు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో వలంటీర్లు సమ్మె చేస్తున్నారని వస్తున్న వార్తలను తాము ఖండిస్తున్నామన్నారు. మాలో అనేక మంది వలంటీరుగా పనిచేస్తూనే ఇతర పనులు కూడా చేస్తున్నందున తాము ఈ సేవలను సంతోషంగానే చేస్తున్నామన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన జగనన్నతోనే ఉంటామని సమ్మెకు దిగమని వలంటీర్లు అన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ వెంపల అప్పారావు, సచివాలయ కన్వీనర్‌లు జోగా నాగేశ్వరరావు, కె.మహాలక్ష్మి, 8వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఆంజనేయ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్యామ్ సుందర్

కైకలూరు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సంసిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు. మండలంలోని భుజబలపట్నం, ఆటపాక హైస్కూళ్లను శుక్రవారం ఆయన సందర్శించి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాల సముదాయ సమావేశాలు ఉపాధ్యాయులు వృత్తిపరమైన బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. పాఠశాల సముదాయ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు సర్వీస్‌లో ఏదైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.శ్రీనివాసరావు, భుజబలపట్నం హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.లక్ష్మీరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీపీడీఈఏ డైరీ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్(ఏపీపీడీఈఏ) 2024 టెక్నికల్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విద్యుత్ సౌధలో జరిగింది. విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ డైరీని ఆవిష్కరించారు. జేఎండీ (విజిలెన్స్) మల్లారెడ్డి టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. శేషారెడ్డి, డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.